సాక్షి వరంగల్

బుధవారం । 8 । మే । 2024



ఏళ్లుగా ఎదురుచూపులే..

వరంగల్ లోక్‌సభ పరిధిలోని కాజీపేట ప్రాంతానికి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ప్రజలు దాదాపు నలభై ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు.

- IIలో ▸



బీజేపీ ప్రచారరథంపై దాడి..

నడికూడ మండలం వరికోల్‌లో వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ ప్రచార రథంపై కాంగ్రెస్ కార్యకర్త దాడి చేశాడు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
39^0 / 28^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



నెక్కొండ: మండలంలోని చిన్నకొర్పోలు, చెరువు ముందరి తండా, కుసుసోతు తండాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారని పేర్కొన్నారు. 45 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని, అలాగే 2300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. నలుగురిపై కేసునమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఏఈఎస్‌లు మురళీధర్, శ్రీనివాసరెడ్డి, సీఐలు నరేశ్‌రెడ్డి, రమేశ్, చందర్, నాగేశ్వర్‌రావు, ఎస్సై రాజన్న, చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కంకులు, డ్రిప్ పైపులు దగ్ధం



సంగెం : మొక్కజొన్న, డ్రిప్ పైపులు దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక రైతుల కథనం ప్రకారం.. కాట్రపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలులు వీచాయి. ఎస్ఎస్ 4 ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలాయి. నిప్పు రవ్వలు పడి తీగల కింద ఉన్న పలువురు రైతుల మొక్కజొన్న కంకి, డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. గమనించిన రైతులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. సుమారు 15 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. కౌలు రైతు మేకల దూడయ్యకు చెందిన 5 ఎకరాల్లో మొక్కజొన్న, చొల్లేటి లక్ష్మారెడ్డి, కొమురారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చింతిరెడ్డి మాధవరెడ్డి, గాయపు కొమురారెడ్డి తదితరులకు చెందిన డ్రిప్ పైపులు కాలిపోయాయి.

వెంకటాపురంలో..



దుగ్గొండి : ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని మొక్కజొన్న కంకులు దగ్ధమైన సంఘటన వెంకటాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. వేసవిలో పంట వ్యర్థాలను కొంత మంది రైతులు తగుల బెట్టారు. అయితే ఒక్కసారిగా గాలిదుమారం రావడంతో మంటలు వేగంగా వ్యాపించి మొక్కజొన్న చేలకు అంటుకున్నాయి. పొగాకు బాలకృష్ణ ఒక ఎకరం, ముత్యాల వెంకన్న 20 గుంటల భూమిలో కుప్పలుగా ఉన్న కంకులు అంటుకుని కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

మట్టి తరలిస్తున్న 8 మందిపై కేసు

పర్వతగిరి: చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దౌలత్‌నగర్ చెరువు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారని మంగళవారం సమాచారం అందింది. దీంతో సిబ్బందితో వెళ్లి హిటాచీ, మూడు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం



చెన్నారావుపేట : వివాహిత అదృశ్యమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. కాల్‌నాయక్ తండా శివారులోని బాల్‌నాయక్ తండాకు చెందిన లావుడ్యా దస్రు కుమార్తె నందిని (19 సంవత్సరాలు) గత నెల 8న ఇంటి నుంచి వెళ్లిపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆచూకీ కనుక్కొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, అదే నెల 22న మళ్లీ ఇంటిలో ఎవరు లేని సమయంలో బయటికి వెళ్లింది. ఇప్పటి వరకు ఆచూకీ తెలియలేదు. కాగా, 6 నెలల క్రితం ఓ వ్యక్తితో ఆమెకు వివాహం జరిగింది. నందిని తండ్రి దస్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్ అభివృద్ధి బాధ్యత నాది





వరంగల్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, హాజరైన పార్టీ శ్రేణులు

వరంగల్, హనుమకొండ కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి

- కడియం శ్రీహరి నిజాయితీని చూసే డాక్టర్ కావ్యకు టికెట్ ఇచ్చాం
- వరంగల్ ఈస్ట్‌లో ఆమె మెజారిటీ బాధ్యత కొండా మురళిదే

సాక్షి, వరంగల్, హనుమకొండ చౌరస్తా: 'ఈ వరంగల్ ప్రాంతం హైదరాబాద్‌తో సమానంగా అభివృద్ధి చెందాల్సింది. రాణిరుద్రమ సాక్షిగా మాట ఇస్తున్నా. ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్ట్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, టెక్స్‌టైల్ పార్కుతో పాటు గుడి, మసీదు, చర్చిలకు నిధులు ఇచ్చి అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటా' అని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లో మంగళవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 'ఈ ప్రాంత కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యమకారులు తొలి, మలి దశ ఉద్యమాలు నడిపి రాష్ట్ర సాధనలో ప్రధాన భూమిక పోషించారు. చారిత్రక నేపథ్యమున్న వరంగల్ పట్టణానికి ఉజ్వల భవిష్యత్ కల్పించాల్సి ఉండగా.. కేసీఆర్ పాలనలో ఈ ప్రాంతమంతా మసకబారిపోయింది. పదేళ్లలో రూ.21 లక్షల కోట్లు చేతికిస్తే సిగ్గు లేని దద్దమ్మలు వరంగల్‌కు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించలేదు. ఎయిర్‌పోర్ట్ కట్టలేదు. టెక్స్‌టైల్ పార్కు పూర్తి చేయలేదు. లెదర్ పార్కుకు అణాపైసా ఇవ్వలేదు. పైగా.. బీఆర్ఎస్ వాళ్లు సిగ్గు లేకుండా మా పాలన 100 రోజులు కూడా కాలేదు.. అప్పుడే దిగిపో దిగిపో అంటున్నారు. మీలాగా అడుక్కొనో, మంది పిల్లల్ని చంపో ఈ కుర్చీలోకి రాలేదన్నారు. అండగా కొండా మురళీధర్‌రావు వంటి వాళ్లు ఉండబట్టి.. వరంగల్ ఈస్ట్‌లో గెలవబట్టి ఈరోజు ఈ కుర్చీలో ఉన్నాం'అని చెప్పారు. మంత్రి కొండా సురేఖ అడిగినట్టుగా గుడి, చర్చి, మసీదు నిర్మాణాలకు రూ.3 కోట్లు జూన్ 30లోపు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ తరపున చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. 'కడియం శ్రీహరి నిజాయితీగా, నిబద్ధతతో ఉమ్మడి రాష్ట్రంలో.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేశారు కాబట్టి ఆయన వారసత్వంగా కడియం కావ్యకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. శ్రీహరి దగ్గర రూ.వందల కోట్లు ఉన్నవని చూసి ఇవ్వలే. ఆయన అనుభవాన్ని తెలంగాణ రాష్ట్రానికి వినియోగించాలనుకున్నాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. వరంగల్ తూర్పులో కొండా సురేఖకు మించి డాక్టర్ కడియం కావ్యకు మెజార్టీ తీసుకురావాల్సిన బాధ్య త కొండా మురళికి ఇస్తున్నామని తెలిపారు. 'ఇక్కడి బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ భూకబ్జాకోరు. దందాలు చేసినోడు. అవినీతిపరులను అంతమొందిస్తామని మోదీ అంటున్నాడు. అరూరి అంత నీతిమంతుడా' అని ప్రశ్నించారు. చీకటి ఒప్పందంలో భాగంగా బీఆర్ఎస్ వాళ్లు వారి నాయకుడు అరూరిని బీజేపీకి పంపించిర్రు. వరంగల్ ప్రజలు వివేకవంతులు. జరగబోయే ఎన్నికల్లో డాక్టర్ కావ్యను లక్ష మెజారిటీతో గెలిపిస్తారు' అని సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మాజీ ఎంపీ దయాకర్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, మేయర్ సుధారాణి పాల్గొన్నారు.

శ్రేణుల్లో జోష్

వర్షం వచ్చినా సీఎం రేవంత్ రెడ్డి కార్నర్ మీటింగ్‌లకు ప్రజలు భారీగా హాజరవ్వడంతో శ్రేణుల్లో జోష్ కనిపించింది. హనుమకొండ చౌరస్తాలో గిరిజన గోండు జానపద నృత్యాలు, బోనాలతో మహిళలు ఘన స్వాగతం పలికారు.

ఇంకా ఎవరెవరు ఏమన్నారంటే..

ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌ను ఆరు ముక్కలుగా చేసిన బీఆర్ఎస్ పార్టీని ఇక్కడి ప్రజలు బొంద పెట్టారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. చారిత్రక నగరం వరంగల్‌ను ప్రత్యేక దృష్టితో చూడాలి. రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తానన్నందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ.. గాంధీ సిద్ధాంతాన్ని అనుసరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి, గాడ్సే సిద్ధాంతంతో ముందుకెళుతున్న బీజేపీ మధ్య జరుగుతున్న పోరాటంలో పేదల పక్షపాతి కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

నేడు వరంగల్‌కు ప్రధాని రాక



సభా ప్రాంగణంలో ఏర్పాట్లు



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్, బీజేపీ నాయకులు

- మోదీ సభకు సర్వం సిద్ధం
- ఎస్పీజీ నిఘానీడలో ఎయిర్‌పోర్ట్, సభావేదిక
- ఏర్పాట్లను పరిశీలించిన బీజేపీ నాయకులు

ఖిలా వరంగల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ తిమ్మాపురం క్రాస్‌రోడ్డు లక్ష్మీపురం మైదానంలో బుధవారం ఉదయం నిర్వహించే బీజేపీ బహిరంగ సభకు ప్రధాని మోదీ రానున్నారు. ఈ మేరకు బహిరంగ సభ వేదిక పనులు పూర్తయ్యాయి. మామునూరు విమానాశ్రయంలో హెలికాప్టర్ ల్యాండింగ్, సభా ప్రాంగణం, పార్కింగ్, భద్రత ఏర్పాట్లను ఎస్పీజీ అధికారులు, ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతితో కలిసి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా మంగళవారం ఉదయం పరిశీలించారు. పీఎం పర్యటన సందర్భంగా సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం జాతీయ రహదారి బెస్తం చెరువు, పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో ఏర్పాట్లు చేశారు. సభకు భారీ పోలీసు బందోబస్తు



ఏర్పాటు చేస్తున్నారు. ఎస్పీజీ కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులు మొత్తంగా వెయ్యి మందికి పైగా పోలీసులు, అధికారులు విధులు నిర్వహించనున్నారు.

ప్రధాని షెడ్యూల్ ఇలా..

బుధవారం ఉదయం 11.30 గంటలకు ప్రధాని మోదీ మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి జాతీయ రహదారి గుండా లక్ష్మీపురంలోని సభాస్థలికి 11.50 గంటలకు చేరుకుని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12.45 గంటలకు తిరిగి మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని హెలికాప్టర్ ద్వారా రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగే సభకు తరలివెళ్లనున్నారని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మల్లాడి తిరుపతిరెడ్డి, జలగం రంజిత్‌రావు, బన్నా ప్రభాకర్, బండి సాంబయ్యయాదవ్, స్థానిక కార్పొరేటర్ జలగం అనితతో కలిసి పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ మంగళవారం పరిశీలించారు.

ఈవీఎంల రెండో అదనపు సప్లిమెంటరీ ర్యాండమైజేషన్



కలెక్టరేట్‌లో ఈవీఎంల రెండో అదనపు సప్లిమెంటరీ ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య.

కాళోజీ సెంటర్ : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 బ్యాలెట్ యూనిట్లు, 50 కంట్రోల్ యూనిట్లు, 10 వీవీ ప్యాట్లు, పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 12 బ్యాలెట్ యూనిట్లు, 50 కంట్రోల్ యూనిట్లు, 8 వీవీ ప్యాట్లను కేటాయించినట్లు రిటర్నింగ్ అధికారి, ప్రావీణ్య తెలిపారు. సాధారణ పరిశీలకుడు స్వాగత్ రణవీర్‌చంద్ సమక్షంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఈవీఎంల రెండో విడత అదనపు సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, ఇండ్ల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



గవిచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

సంగెం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. గవిచర్ల, చింతలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరిపడా టార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వర్షం వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కాంటాలు అయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. మిల్లర్ల నుంచి ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం 17 శాతం ఉండేలా ధాన్యాన్ని తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, ఏపీఎం కిషన్, సీసీలు రాజయ్య, ఏలియా, కమిటీ సభ్యులు అంబిక, రజియ, మంజుల, లక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

'మోసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి'

నర్సంపేట రూరల్ : తనకు తెలియకుండా అబార్షన్ చేయించి, గర్భసంచిని తొలగించిన వ్యక్తి, ఆస్పత్రి యాజామాన్యంపై చర్య తీసుకోవాలని బాధితురాలు డిమాండ్ చేసింది. ఈ మేరకు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ధర్నా చేసి మాట్లాడింది. నర్సంపేటకు చెందిన తనకు 2012లో కాజీపేటకు చెందిన గిరిగాని హరిప్రసాద్‌తో వివాహం జరిగింది. ఇద్దర కుమార్తెలు జన్మించారు. అనంతరం గొడవల కారణంగా భర్త తనను వదిలేయడంతో నర్సంపేటలోని ఓ షాపులో పనిచేస్తూ జీవనం కొనసాగించాను. ఈక్రమంలో నర్సంపేటకు చెందిన దామెర భిక్షపతితో పరిచయం ఏర్పడింది. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. సుమారు రెండు సంవత్సరాలు భిక్షపతితో సహజీవనం చేశాను. జనవరి 14న గర్భవతి అని తెలియడంతో అబార్షన్ చేయించాలని ఒక మాత్ర ఇచ్చాడు. ఏం మాత్ర అని నిలదీయంతో బలం కోసం తెచ్చానని నమ్మ బలికాడు. దీంతో ఆ మాత్రను వేసుకోవడంతో తనకు తీవ్ర రక్తస్రావమైందని బాధితురాలు తెలిపింది. దీంతో తాను స్పృహ కోల్పోవడంతో వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రి తీసుకెళ్లగా పరిస్థితి చేజారిందని, వైద్యం అందించలేమని వెనక్కి పంపించారు. 17న నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తాను స్పృహలో లేనప్పుడు అబార్షన్ చేయించి, గర్భసంచి సైతం తొలగించారు. ఆ విషయాన్ని దాచిపెట్టి పెళ్లి చేసుకుంటానని నమ్మించి వెళ్లిపోయాడని, ఇంతవరకు రాలేదన్నారు. ఇటీవల తాను, తన చెల్లెలు భిక్షపతిని నిలదీయగా.. చెల్లెలుపై మహబూబాద్‌లో దాడి చేశారన్నారు. అనుమానంతో వారం రోజుల క్రితం వేరే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా గర్భసంచి తొలగించారని చెప్పడంతో మంగళవారం వచ్చి ఆస్పత్రి ఎదుట ధర్నా చేసినట్లు తెలిపారు. తనకు తెలియకుండా ఎలా తీస్తారని ఆస్పత్రి యాజమాన్యాన్ని నిలదీసినట్లు పేర్కొన్నారు. అనంతరం నర్సంపేటలో షీటీంకు ఫిర్యాదు చేశానని, తనను మోసం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోని న్యాయం చేయాలని కోరినట్లు ఆమె తెలిపింది. ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలికి ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ సంఘీభావం తెలిపారు.

వేసవి దుక్కులతో మేలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్

నెక్కొండ : వేసవి దుక్కులతో చీడపీడలు కలిగించే పురుగులు నాశనమై ఎంతో మేలు చేకూరనుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్ అన్నారు. వెంకటాపురం, అప్పల్‌రావుపేట, నెక్కొండ గ్రామాల్లోని రైతులకు మంగళవారం ఆమె పలు సూచనలు చేశారు. వేసవి పంటల అవశేషాలను (పత్తి, మొక్కజొన్న, వరి) తగుల బెట్టకుండా నేలలో కలిసే విధంగా దున్నితే సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందన్నారు. నేలలోని పోషక విలువల సమాచారం కోసం మట్టి నమూనాలను పరీక్ష చేయించాలన్నారు. వరి పంట వేసే ముందుగా పచ్చిరొట్ట పైరును సాగు చేసుకోవాలని ఆమె చెప్పారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచనలున్నందున రైతులు విద్యుత్ స్తంభాలు, తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎరువుల షాపులను ఆమె తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ కన్సల్టెంట్ పి.సారంగం, ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ టెక్నికల్ అధికారి సీహెచ్.కృష్ణారెడ్డి, ఏఈఓ వసంత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- కట్ర్యాలలో చెట్టు కొమ్మలు మీదపడి బీటెక్ విద్యార్థి మృతి
- తడిసిన ధాన్యం, మొక్కజొన్నలు.. రాలిన మామిడి కాయలు
- పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచి అంధకారం
- బుధరావుపేటలో ఎగిరిపోయిన రెండు ఇళ్ల రేకులు



జాతీయ రహదారిపై చెట్టు కొమ్మలను తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది

నర్సంపేట/వర్ధన్నపేట/ఖానాపురం : జిల్లాలో మంగళవారం సాయంత్రం గాలిదుమారంతో కురిసిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. వరంగల్ నగరంతోపాటు నర్సంపేట నియోజకవర్గం, సంగెం, గీసుకొండ, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాల్లో వాతావరణం చల్లబడింది. ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్నలు తడిసిముద్దయ్యాయి. పలుప్రాంతాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. కోత దశకు వచ్చిన వరి పంట నేలవాలింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం ఏర్పడింది. ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామంలో కృష్ణారెడ్డి, గట్ల సతీశ్ ఇళ్ల రేకులు కొట్టుకుపోయాయి. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై కట్ర్యాల శివారులో ఎండిపోయిన పెద్ద చెట్టు రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్టుకొమ్మలు మీదపడి ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న విద్యార్థి మృతిచెందాడు.

విద్యార్థి మృతితో ఇల్లందలో విషాదఛాయలు..

చెట్టుకొమ్మలు మీదపడి ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న విద్యార్థి మృతి చెందడంతో ఇల్లంద గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన ఆబర్ల



మృతిచెందిన దయాకర్ (ఫైల్)

దయాకర్(22) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. మంగళవారం రాత్రి తమ సొంత ట్రాక్టర్‌లో గడ్డి లోడుతో సంగెం మండల కేంద్రానికి వెళ్లి అన్‌లోడ్ చేసి తిరిగి ఇల్లంద గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి కట్ర్యాల శివారులోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై వెళ్తుండగా ఈదురు గాలులతో చెట్టు కూలి పోయింది. ఆ చెట్టుకొమ్మలు ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న దయాకర్‌పై పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో దయాకర్ తల్లిదండ్రులు శ్రీనివాస్–రమ కన్నీరుమున్నీరయ్యారు. దయాకర్‌కు ఇద్దరు అక్కలు లావణ్య, సుకన్య ఉన్నారు.



ఖానాపురం : బుధరావుపేటలో రేకులు ఎగిరిపోయిన ఇల్లు

రోడ్డుపై చెట్టును తొలగించిన పోలీసులు

వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తన సిబ్బంది బుచ్చిరాజు, దామోదర్, నరేందర్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జేసీబీ లేకపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీస్ సిబ్బందితో కలిసి చెట్టును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ప్రతి సర్కిల్‌లో కంట్రోల్ రూం

హన్మకొండ: ఈదురు గాలులు, అకాల వర్షాలపై విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి.. ప్రతి సర్కిల్‌లో నిరంతరాయంగా పని చేసేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆయన మంగళవారం అధికారులు, ఉద్యోగులకు సూచనలు చేశారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధిగా హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ సేవలందించాలని ఒక ప్రకటనలో ఆదేశించారు. అత్యవసరమైతే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన మెటీరియల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూంకు సంబంధిత సమాచారాన్ని చేరవేయాలని పేర్కొన్నారు. సమస్యలపై వినియోగదారులు టోల్ ఫ్రీనంబర్ 1800 425 0028 లేదా 1912కు ఫోన్ చేయాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వర్ధన్నపేట పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. బీఆర్ఎస్‌ను మోసం చేసిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌కు ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన రెండు పిల్లర్లను మరమ్మతులు చేయాల్సింది పోయి నీటిని మొత్తం సముద్రంలోకి విడిచి పెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తిగా ప్రజల్లో నమ్మకం పోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని అనవసరంగా గెలిపించామని ప్రజలు తలలు పట్టుకుంటున్నారని తెలిపారు.

మీకు తెలుసా ?

1950 నుంచి సార్వత్రిక ఓటు హక్కు..



కాజీపేట: భారతదేశంలో 1950 నుంచి సార్వత్రిక ఓటు హక్కు అమల్లోకి వచ్చింది. రాజ్యాంగంలోని 326 అధికరణం ద్వారా సార్వత్రిక ఓటు హక్కు కల్పించారు. ఇది ప్రపంచ రాజకీయ చరిత్రలో ఒక విప్లవాత్మక చర్య. ఎందుకంటే సార్వత్రిక ఓటుహక్కు అమలుకావడానికి చాలా దేశాల్లో వందల సంవత్సరాలు పట్టింది. భారతదేశంలో సార్వత్రిక ఓటుహక్కు వచ్చేనాటికి గ్రీస్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, స్విట్జర్లాండ్ తదితర దేశాల్లో కొన్ని వర్గాలకు ఇంకా ఓటుహక్కు అందలేదు. ఇదీ భావితరాలకు భారత రాజ్యాంగం చూపిన రాజకీయ పరిణతి.

ప్రచారంలో అక్రమాలకు పాల్పడితే.. ఎన్నిక వాయిదా

కాజీపేట: ఎన్నికల ప్రచారంలో అక్రమాలు నెలకొన్నాయని ఎన్నికల సంఘం భావిస్తే ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణను వాయిదా వేయొచ్చు. దేశంలో మొదటిసారి తమిళనాడులోని రెండు నియోజకవర్గాల్లో ఎన్నికలు వాయిదా వేసింది. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘించి ఓట్ల కోసం డబ్బులు పంపిణీ చేశారని భావించిన ఎన్నికల సంఘం.. ఆయా ఎన్నికలను రద్దుచేసింది. మరో తేదీలో ఎన్నికలు నిర్వహించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం పాత్ర ఎంత శక్తివంతమైందో ఈ నిర్ణయాల ద్వారా తెలుసుకోవచ్చు.

పాట.. ప్రచారం

- ప్రత్యేక గీతాలతో హోరెత్తుతున్న క్యాంపెయిన్
- పాటల రూపంలో ప్రజల్లోకి వస్తున్న అభ్యర్థులు



కాజీపేటలో పాటలతో ప్రచారం నిర్వహిస్తున్న వాహనం

కాజీపేట : లోక్‌సభ ఎన్నికల పోలింగ్ గడువు దగ్గర పడుతుండడంతో ప్రచారానికి అభ్యర్థులు అందుబాటులో ఉన్న అన్నీ అవకాశాలను వినియోగించుకుంటున్నారు. పార్టీ మేనిఫెస్టో, చేసిన అభివృద్ధిని పాటల రూపంలో వివరిస్తూ ప్రత్యేక వాహనాల ద్వారా వీధుల్లో తిరుగుతూ వివరిస్తున్నారు. పెరిగిన సాంకేతికతకు అనుగుణంగా ఎల్‌ఈడీ తెరలు, డీజేలతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రచారంలో జోష్ పెంచుతున్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని మండలాలు, పట్టణాల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు.. తమ పేరిట ప్రత్యేక గీతాలు సిద్ధం చేసుకున్నారు. నడువు నడువవే రామక్క.. కలిసి నడుం కట్టవే రామక్క అంటూ బీఆర్‌ఎస్, వందేళ్ల చరిత్రగలదమ్మో మన కాంగ్రెస్..త్యాగాల ఘనత గలదమ్మో మన కాంగ్రెస్ అంటూ కాంగ్రెస్, 'కదలిరండి బీజేపీ కార్యకర్తలరా..కదం తొక్కి నడవండి.. వీరయోధులారా.. అంటూ బీజేపీ పాటలు నియోజకవర్గంలో మార్మోగుతున్నాయి. ఈ పాటలతో ప్రచారం రెండు విధానాల్లో సాగుతోంది. ఒకటి కళాజాత బృందాలు అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తూ పాటలు పడుతున్నారు. మరో విధానంలో పాటలతో పాటు ఆయా అభ్యర్థులు, పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వాన్ని చూపే వీడియోలకు జోడించి కూడళ్లలో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి ప్రదర్శిస్తున్నారు. స్థానికంగా ఒక్కో ప్రధాన అభ్యర్థుల పేరిట ఐదు, ఆరు పాటలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన పాటలు వీటికి అదనం. పాటలతో నిర్వహిస్తున్న ప్రచారంపై స్థానికులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులే..

ఎన్నికల నినాదంగానే మారిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అంశం

- అభ్యర్థిగా ఉన్నప్పుడు కోచ్‌ఫ్యాక్టరీపై రాజీలేని పోరాటం చేస్తామని హామీ
- గెలుపొందిన అనంతరం ఆ ఊసే ఎత్తని ప్రజాప్రతినిధులు
- మండిపడుతున్న ప్రజలు



కాజీపేట రైల్వే జంక్షన్

కాజీపేట: వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కాజీపేట ప్రాంతంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ప్రజలు దాదాపు నలభై ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. దశాబ్దాలు గడిచినా ఆ కల నేరవేరడం లేదు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశం ఎన్నికల నినాదంగానే మారింది. ప్రభుత్వాలు, నాయకులు మారినప్పుడల్లా కోచ్ ఫ్యాక్టరీ అంశం తెరపైకి వస్తుంది. ప్రతి ఎన్నికలలో కోచ్ ఫ్యాక్టరీ హామీగానే మిగిలిపోతోంది. నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రాంతం నుంచి ఎంపీలుగా గెలిచిన నాయకులు దీనిపై దృష్టిని సారించడం లేదు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు జరగకపోవడం వల్లే ఈ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేకుండాపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పంజాబ్‌కు తరలిన కోచ్ ఫ్యాక్టరీ

120 సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారి సహకారంతో కాజీపేట మీదుగా రైల్వే లైన్ నిర్మాణం సాగింది. రైల్వే జంక్షన్‌గా రూపాంతరం చెంది వంద ఏళ్లు కావొస్తున్నా అభివృద్ధి పరంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 1985లో కోచ్ ఫ్యాక్టరీ వచ్చినట్టే వచ్చి పంజాబ్‌కు తరలిపోయి తీవ్ర నిరాశ మిగిల్చింది.

ఉత్తర-దక్షిణ రాష్ట్రాలకు వారధి

కాజీపేట రైల్వే జంక్షన్ ఉత్తర-దక్షిణాది రాష్ట్రాలకు వారిధి కొనసాగుతోంది. ఈ ప్రాంతం నుంచి నిత్యం 120కి పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. దేశంలోనే రైల్వేకు అత్యంత ఆదాయం వచ్చేది సికింద్రాబాద్ జోన్ నుంచే.



మూడు దశాబ్దాలుగా పోరాటాలు

కాజీపేట ప్రాంతంలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ మూడున్నర దశాబ్దాలుగా ఉంది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పాటు నేడు ఉన్న అన్ని రాజకీయ పక్షాలు ఏదో రకంగా ప్రజల్లోకి వచ్చి ఉద్యమాలు చేసిన వారే కావడం గమనార్హం. నెలల పాటు నిరాహార దీక్షలు, రోజుకో రూపంలో ఆందోళనలు చేసి జైలు పాలైన కార్యకర్తలు ఉన్నారు. ఇక్కడ బలమైన నాయకుడు లేకపోవడం.. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం కొరవడడంతో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రక్రియ ఎన్నికల నినాదంగానే మిగిలిపోతోందని చెప్పొచ్చు. స్థానిక సంస్థల నుంచి మొదలు.. లోక్‌సభ ఎన్నికల వరకు కోచ్‌ఫ్యాక్టరీ, డివిజన్ కేంద్రం ఏర్పాటు అంశం రాజకీయ పార్టీలకు ఎన్నికల నినాదంగా మారింది.

ప్రజాప్రతినిధుల పాత్ర శూన్యం

రాష్ట్రంతో పాటు కేంద్రంలో ఎన్నికలు రాగానే అన్ని రాజకీయ పక్షాలు కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ కేంద్రం ఏర్పాటుపై రాజీలేని పోరాటం చేస్తామని ప్రజలకు హామీ ఇస్తుంటాయి. తీరా గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులు ఈ అంశంపై చట్టసభల్లో ఊసెత్తడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ఉన్నా కేంద్రం చొరవ చూపించకపోవడం చర్చనీయంశంగా మారింది. రేపటి లోక్‌సభ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అభ్యర్థి ఎంపీగా గెలిచిన మొదటి ప్రాధాన్యం రైల్వేపరంగా కాజీపేటకు జరుగుతున్న అన్యాయంపైనే ఉండాలని జిల్లా వాసులు కోరుకుంటున్నారు.

అటకెక్కిన డివిజన్ కేంద్రం ఏర్పాటు

కాజీపేట ప్రాంతాన్ని రైల్వే డివిజన్ చేయాలనే ప్రతిపాదనలు అటకెక్కాయి. తెలంగాణ ఏర్పాటు కోసం పోరాటం మొదలైనప్పటి నుంచి దీనిపై చర్చ సాగుతోంది. ఈ డివిజన్ ఏర్పాటుపై కూడా రైల్వే తెలంగాణ జేఏసీ, రాజకీయ పార్టీల నాయకులు అనేకసార్లు పోరాటాలు చేశారు. ఆ సమయంలో సానుకూలంగా స్పందించిన రైల్వే అధికారులు ఆ తర్వాత ఏ కారణంతోనో మిన్నకుండిపోయారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

భరత్‌ను ఎందుకు దూరం పెడుతున్నారు?

- పరకాల ఎమ్మెల్యే రేవూరికి మంత్రి కొండా సురేఖ ప్రశ్న
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో

గీసుకొండ: మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య సంభాషణకు సంబంధించించిన ఓ వీడియో మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. గీసుకొండ మండలం రాంపురానికి చెందిన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు రడం భరత్ అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన కొన్ని రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరారు. అతడిని పార్టీలో ఎందుకు దూరం పెడుతున్నారని మంత్రి సురేఖ.. ఎమ్మెల్యేను ఆ వీడియోలో ప్రశ్నించారు. కాంగ్రెస్ మండల నాయకులు, ఎంపీపీ.. భరత్‌ను తీసుకోవద్దని చెప్పారని ఎమ్మెల్యే బదులిచ్చారు. పర్సనల్‌గా మీతో మాట్లాడుతా అని ఎమ్మెల్యే అంటున్నా మంత్రి తన వాదన వినిపించారు. తనకు తెలియకుండా వరంగల్ మేయర్ కాంగ్రెస్‌లో చేరినా ఆమెను తనతో తిప్పుకుంటున్నానని తెలిపారు. మా ఆధ్వర్యంలో చేరిన భరత్‌ను మీరెందుకు కలుపుకొనిపోవడం లేదన్నారు. ఈ విషయం ముందుగా తనకు చెబితే బాగుండేదని ఎమ్మెల్యే బదులిచ్చారు. ప్రస్తుత బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లోకి ఎలా తీసుకుంటున్నారని మంత్రి ప్రశ్నించారు. కొండా మురళి సహకారంతో సౌజన్య ఎంపీపీ అయ్యిందని, ఆమెను త్వరలో గద్దె దింపుతామని చెప్పారు. భరత్ కాంగ్రెస్ సమావేశం కోసం అనుమతి అడిగితే అతడిపై కేసు పెట్టడం ఏంటని అడిగారు. దయాకర్‌రావు లాంటి వారికే భయపడలేదని మంత్రి అంటే.. తనకు ఆ మీటింగ్ విషయం అసలు తెలియదని ఆయన సున్నితంగా సమాధానం చెబుతూ ఫోన్ కట్ చేశారు. ఈ వీడియో పలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతుండడం చర్చనీయాంశమైంది.

బీజేపీ ప్రచార రథంపై దాడి..

- కాంగ్రెస్ కార్యకర్తపై కేసు నమోదు



ప్రచార రథంపై దాడి చేస్తున్న మధుకర్

పరకాల: నడికూడ మండలం వరికోల్ గ్రామంలో వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ప్రచార రథంపై దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్త కణాల మధుకర్‌పై పరకాల పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం వరికోల్ గ్రామ కూడలిలో ప్రచారం నిర్వహిస్తుండగా.. మధుకర్ రథం వద్దకు ఆగ్రహంగా దూసుకొచ్చాడు. మోదీ చిత్రం ఉన్న ఫ్లెక్సీని తొలగించాడు. అనంతరం రథానికి ఉన్న మిగతా ఫ్లెక్సీలను తొలగిస్తున్న క్రమంలో కొందరు గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై బీజేపీ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ప్రచార రథం ఫ్లెక్సీని తొలగించిన నేపథ్యంలో మధుకర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ డి.రవిరాజ్ తెలిపారు.

రూ.3 లక్షల నగదు పట్టివేత

డోర్నకల్ : డోర్నకల్ శివారు అమ్మపాలెం క్రాస్ చెక్ పోస్టు వద్ద మంగళవారం ఓ వ్యక్తి వద్ద రూ.3 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గార్లకు చెందిన ఆశిష్ ద్విచక్రవాహనంపై డోర్నకల్ మీదుగా గార్ల వెళ్తుండగా సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో ఎలాంటి ఆధారాలు లేని రూ.3 లక్షలు లభ్యం కావడంతో సీజ్ చేసినట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు.

అర్హత ఉన్న ప్రతీ రైతుకు రైతుభరోసా

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంగపేట: మాట్లాడుతున్న మంత్రి

మంగపేట: అర్హత ఉన్న ప్రతీ రైతుకు రైతుభరోసా పథకం వర్తిస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుభరోసా పథకం నగదును రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిందన్నారు. ఐదెకరాలకు పైగా భూమి ఉన్న అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో ఎకరాకు రూ. 5వేల చొప్పున జమచేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదన్నారు. మంత్రి వెంట భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఉన్నారు.

ప్రజా ప్రతినిధులు ప్రజాసేవకులు..

వాజేడు: ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఎల్లప్పుడు సేవకులేనని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వాజేడులో నిర్వహించిన వెంకటాపురం(కె), వాజేడు మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే దేశ భవిష్యత్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. తమకు వాజేడు, వెంకటాపురం(కె) మండలాలపై ప్రత్యేక అభిమానం ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి నిత్యం కృషి చేస్తామన్నారు. కాగా, వాజేడు మండలానికి బస్సులు రావడం లేదని నాయకుడు బోదెబోయిన కృష్ణ చెప్పడంతో స్పందించిన తుమ్మల.. వెంటనే ఆర్టీసీ ఎండీకి ఫోన్ చేసి బస్సు వాజేడు కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, డెనార్జున్ రావు, రవికుమార్, దుర్గాప్రసాద్, కె. వెంకటస్వామి, రవిశంకర్, అంజయ్య, మోహన్‌రావు, వాసు, ప్రసాద రాజు,తదితరులున్నారు.

మతతత్వ పార్టీతో జాగ్రత్తగా ఉండాలి

- ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

జనగామ రూరల్: తెలంగాణ ప్రజలు చైతన్యవంతం అయినప్పటికీ మతతత్వ పార్టీలతో జాగ్రత్తగా ఉండాలని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో భారత్ బచావో సాధిక్ ఫౌండేషన్ ఆధ్వర్యాన 'ప్రమాదంలో భారత రిపబ్లిక్-పౌరుల పాత్ర' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సుకు ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్‌తో కలిసి హాజరయ్యారు. కోదండరాం మాట్లాడుతూ.. మతం దేశంలో ఒక రాజకీయ అంశంగా మారిందని, విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా అధికారంలోకి రావడం ప్రమాదకరమన్నారు. పదేళ్లుగా భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను బీజేపీ అపహాస్యం చేసిందని విమర్శించారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఇవ్వమంటే రైతులను జైలుకు పంపుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేస్తూ దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య బద్ధంగా పాలించే వారిని చట్ట సభలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో సాధిక్ అలీ, విద్యావేత్త రియాజ్, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ రాజమౌళి, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల స్థానానికి 14 మంది నామినేషన్



నామినేషన్ వేస్తున్న అభ్యర్థి రాకేష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి

నల్లగొండ : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నామినేషన్లలో భాగంగా మంగళవారం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య, అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ నుంచి ఈడ శేషగిరిరావు, శ్రమజీవి పార్టీ నుంచి జాజుల భాస్కర్, యువతరం పార్టీ నుంచి బండారు నాగరాజు నామినేషన్లు వేశారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులుగా ఐతగోని రాఘవేంద్ర, పిడిశెట్టి రాజు, పూజారి సత్యనారాయణ, మారం వెంకట్ రెడ్డి, గుగులోత్ భీమా, డాక్టర్ పెంచాల శ్రీనివాస్, కంటే సాయన్న, దైదా సోమసుందరం, అల్వాల కనకరాజు నామినేషన్ దాఖలు చేశారు. ములుగు జిల్లా అదనపు కలెక్టర్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్.మహేందర్‌జీ నామినేషన్లు స్వీకరించారు.

నాలుగు నెలల్లో.. నలభై ఏళ్ల నరకం

నాలుగు నెలల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నలభై ఏళ్ల నరకం చూపెడుతోందని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా మంగళవారం నల్లగొండలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేశారని, పార్లమెంట్ ఎన్నికలతోపాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే నిరుద్యోగుల హక్కులపై పోరాడుతానని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఒత్తిడి తీసుకువస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సత్యవతి రాథోడ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజయ్యకు 'దళిత బంధు' సెగ



మాట్లాడుతున్న దళిత బంధు బాధితులు

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండలం వెంకటాద్రిపేటలో మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు 'దళిత బంధు' సెగ తగిలింది. బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలంటూ మంగళవారం మధ్యాహ్నం వెంకటాద్రిపేటలో ప్రచారంలో రాజయ్య మాట్లాడుతుండగా.. 'దళిత బంధు' స్కీం కోసం డబ్బులు ఇచ్చాం.. ఇప్పటి వరకు మంజూరు కాలేదు.. ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలి' అంటూ గొడవకు దిగారు. దీంతో రాజయ్య ప్రచారం ముగించి వేరే గ్రామానికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, దళిత బంధు బాధితుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా బాధితులు కనకం కిరణ్‌కుమార్, కనకం సుధాకర్, కందుకూరి రత్నాకర్ మాట్లాడుతూ 'దళిత బంధు' కింద రూ.10 లక్షలు రావాలంటే అప్పటి ఎమ్మెల్యే రాజయ్యకు డబ్బులు ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పగా ఆశతో అందిన కాడ అప్పులు తెచ్చి రూ.2.50 లక్షలు ఇచ్చామని చెప్పారు. స్కీం మంజూరు కాలేదు.. అప్పు తెచ్చినకాడ వడ్డీలు పెరుగుతున్నాయని, ఎన్ని సార్లు అడిగినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కనీసం ప్రచారానికి వచ్చిన రాజయ్య కూడా ఎలాంటి సమాధానం చెప్పకుండా వెనుదిరిగాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

మోదీ, కేసీఆర్ బీసీలను మోసం చేశారు



మాట్లాడుతున్న బైరి రవికృష్ణగౌడ్

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ

కాజీపేట రూరల్ : ప్రధాని నరేంద్రమోదీ, బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు బీసీలను మోసం చేశారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవిగ్రాండ్ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ బీసీ అయి ఉండి కూడా బీసీలకు ఏమీ చేయలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఏకపక్ష నిర్ణయంతో బీసీలపై వివక్ష చూపిందన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో బీసీ సంఘం ముఖ్య నాయకులతో కలిసి వినతి పత్రం అందజేయగా.. కాంగ్రెస్ గెలిస్తే మొదటి సంతకం చేస్తామని చెప్పినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీసీలందరూ ఏకమై కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చు ఆనందం, తమ్మల శోభారాణి, రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల సంపత్‌కుమార్, పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజగోపాల్, అముదాల మల్లేషంగౌడ్, దేవేందర్, జ్ఞానేశ్వర్, రమేష్, కాసగాని అశోక్, పంజాల మధు, గూడూరు బాలాజీ, రాము, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

- నాన్ లోకల్ అభ్యర్థులకు ఓటువేయకండి
- కడియం శ్రీహరిది నీచ చరిత్ర
- బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

నయీంనగర్: దేశం మోదీ చేతిలో ఉంటేనే భద్రంగా ఉంటుందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో అరూరి రమేష్ మాట్లాడారు. తనను ఆశీర్వదిస్తే మోదీ సహకారంతో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య భర్తది గుంటూరు అని, బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ది కరీంనగర్ అన్నారు. కడియం శ్రీహరిది నీచ చరిత్ర అన్నారు. ఒకప్పుడు ఆయన ఆస్తులు ఎంత.. ఇప్పుడు ఎంత అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నప్పుడు కొండా సురేఖకు టికెట్ రాకుండా చేశారన్నారు. తాను మూడో సారి గెలిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిని అవుతానని, అందుకే తనను ఓడించడం కోసం కడియం శ్రీహరి కుట్రలు చేశాడన్నారు. దళిత దొర హయాంలో పేద బిడ్డల ఎన్‌కౌంటర్ జరిగిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఓటమి భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో మూడుసార్లు ప్రచారానికి వచ్చారన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు నాన్ లోకల్ అని, తాను ఒక్కడినే లోకల్ దళిత బిడ్డనని, వరంగల్ ప్రజలు తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను గెలవగానే వరంగల్‌ను అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చేస్తానన్నారు. వరంగల్ నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, మామునూరు ఎయిర్‌పోర్టు, వరంగల్ ఇండస్ట్రీయల్ కారిడార్, పాలకుర్తి-కొడకండ్లలో టెక్స్‌టైల్ పార్క్, మడికొండలో ఐటీ హబ్ ఎక్స్‌పాన్షన్, భూపాలపల్లి-పరకాల రైలు మార్గం, ఏనుమాముల మార్కెట్ ఆధునీకరణ, అనేక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. తనకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు. ప్రజలు బీజేపీని ఆదరించి మోదీని గెలిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. నేడు జరిగే ప్రధాని మోదీ జనసభలో ప్రజలు, బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, జర్నలిస్టు సంఘాల నేతలు గడ్డం రాజిరెడ్డి, గాడిపల్లి మధు, బీఆర్ లెనిన్, దయాసాగర్, ఎం. రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ టీషర్టు విప్పించిన కాంగ్రెస్ నాయకులు

- సోషల్ మీడియాలో వైరల్



కాటారం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి పనుల వద్దకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు అక్కడ ఓ కూలీ ధరించిన బీఆర్‌ఎస్ గుర్తు, కేసీఆర్ ఫొటోతో కూడిన టీషర్టును విప్పించిన సంఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు ఒడిపిలవంచ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లారు. ఓటు అభ్యర్థిస్తున్న సమయంలో ఓ కూలీ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన టీషర్టు ధరించడం గమనించిన నాయకులు దానిని విప్పేస్తే మరో టీషర్టు ఇస్తామని సదరు కూలీకి చెప్పారు. దీంతో ఆయన టీషర్టు విప్పేయగా కాంగ్రెస్ నాయకులు దూరంగా విసిరారు. కాగా, కాంగ్రెస్ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోగానే ఆ కూలీ తిరిగి అదే టీషర్టు ధరించి పనుల్లో నిమగ్నమయ్యాడు. ఇదంతా అక్కడే ఉన్న ఒక్కరు ఇద్దరు కూలీలు తమ సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో వేశారు. ఈ విషయమై కాంగ్రెస్ మండల నాయకులను వివరణ కోరగా సదరు కూలీ తన ఇష్టం మేరకే టీషర్టు విప్పారని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

IV
సాక్షి ఫ్యామిలీ
వరంగల్
బుధవారం ॥ 8-5-2024

ఉండాల్సింది ధైర్యం మాత్రమే!

ప్రపంచంలో చాలామంది ఒకే తరహా పనిని ఏళ్లుగా చేస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కొందరు మాత్రం ఏకకాలంలో ఎన్నో పనులు చేస్తూ సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు ఇందు గుర్జార్. జైపూర్‌వాసి అయిన 32 ఏళ్ల ఇందు గుర్జార్ సింగిల్ పేరెంట్‌గా తన తొమ్మిదేళ్ల కూతురును చూసుకుంటూ, బ్యాంకు ఉద్యోగం చేస్తూ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా, మౌంటెనీర్ బైకర్‌గా గుర్తింపు తెచ్చుకుంటోంది. సవాళ్లను అధిగమిస్తూ ఇందు చేస్తున్న ప్రయత్నం ఒడిదొడుకులను ఎదుర్కొనేవారికి స్ఫూర్తిగా నిలుస్తుంది.


ఇందు గుర్జార్

''సమస్యలు వచ్చేదే మనలోని శక్తిని గుర్తించడానికి. ధైర్యం తెచ్చుకొని ప్రయత్నిస్తే తిరిగి మనకో కొత్త జీవితం ఏర్పడుతుంది. నా చిన్నతనంలో మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. మా నాన్నకు టీ కొట్టు ఉండేది. కానీ, దాని నుంచే ఆయన తన కొడుకులలో ఒకరిని డాక్టర్‌ని చేసి, మా అందరికీ ఉత్తమవిద్యను అందించడానికి ప్రయత్నించాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. చిన్ననాటి నుంచి క్రీడలంటే చాలా ఆసక్తి. రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ ఆడాను. కాలేజీలో స్పోర్ట్స్ ఆప్షన్ లేకపోవడంతో నా ఇష్టాన్ని అక్కడితో వదిలేయాల్సి వచ్చింది.

■ గృహహింస

మా కమ్యూనిటీలో అమ్మాయిలకు పెళ్ళిళ్లు త్వరగా చేస్తారు. కానీ, నా తల్లిదండ్రుల సహకారంతో గ్రాడ్యుయేషన్ వరకు చదువుకున్నాను. ఆ వెంటనే పెళ్లి చేశారు. పెళ్లి నా జీవితాన్ని విచ్ఛిన్నం చేసింది. బిడ్డను కనాలని, వరకట్నం తేవాలని... ప్రతిరోజూ ఏదో ఒక విషయం మీద నరకం చూసేదాన్ని. అత్తింటివాళ్లు నా తల్లిదండ్రులకు నా మీద ఏవేవో చాడీలు చెప్పేవారు. పాప పుట్టిన తర్వాత పుట్టింటి నుండి తిరిగి అత్తవారింటికి వెళ్లడానికి భయపడ్డాను. కానీ, పెద్దవారిని కూర్చోబెట్టి, ఒప్పించి తిరిగి తీసుకెళ్లారు. కానీ, అక్కడి పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదు. నెల రోజుల వ్యవధిలోనే మా అత్తింటిని వదిలి, తిరిగి పుట్టింటికి వచ్చేశాను. ఏడాది కాలం పుట్టింట్లోనే ఉన్నాను. పరిస్థితుల్లో మార్పు రాదని గ్రహించి, విడాకులకు కోర్టులో కేసు వేశాను. ఒంటరిగా బిడ్డను పెంచడం నాకు అంత తేలికైన పనికాదు. ఇంటి నిర్వహణకు, నా ఇష్టాలను నెరవేర్చుకోవడానికి ఇంధనం అవసరం. ఆ మనోవర్తి రూపంలో ఆ ఇంధనం రాబట్టుకోవడం కోసం ఏడేళ్లపాటు విడాకుల కేసుపై పోరాడుతూనే ఉన్నాను. కానీ, న్యాయం జరగలేదు.



■ డిప్రెషన్ నుంచి కోలుకొని...

ఆటుపోట్లతో ఉన్న జీవితాన్ని చూసి చాలా బాధపడేదాన్ని. ఒక వ్యక్తి జీవితంలో చెడుకాలం వచ్చినప్పుడు పరిస్థితుల ముందు లొంగిపోతాడు. కానీ, నాకు నేనుగా ఏదైనా లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలనుకున్నాను. బ్యాంకు ఉద్యోగం సంపాదించుకొని, నాకు నేనుగా జీవించడం మొదలుపెట్టాను.



■ ఫిట్‌గా ఉండేందుకు..

ఉద్యోగం చేయడం మొదలుపెట్టిన కొన్ని రోజులకే కోవిడ్ వచ్చింది. మొదటి వేవ్‌లో కరోనా బాధితురాలిని అయ్యాను. వాడిన మందుల వల్లనేమో కోవిడ్ తర్వాత బరువు పెరగడం మొదలైంది. దీంతో ఫిట్‌గా ఉండేందుకు రోజూ రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసేదాన్ని. ఆ తర్వాత స్టేడియంకు వెళ్లడం మొదలుపెట్టాను. అక్కడ సైక్లిస్టుల బృందాన్ని కలిశాను. ఆ క్రీడలో పాల్గొనడానికి వయోపరిమితి ఏమీ లేదని తెలిసింది. దాంతో నాలో చిన్న ఆశ కలిగింది. బహుశా విధి నాకు అలాంటి అవకాశం ఇచ్చింది అనుకున్నాను. మొదట్లో రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసే నేను ఈ రోజు 50– 100 కిలోమీటర్లు తిరుగుతున్నాను. యూసీఐ (ఇంటర్నేషనల్ సైకిలిస్ట్ యూనియన్) ఎలిమినేటర్ ప్రపంచకప్‌లో పాల్గొన్నాను. ఎన్నో పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొని, అంతర్జాతీయ సైక్లిస్టులను కలిశాను.

■ పర్వత బైకర్‌గా...

వృత్తిరీత్యా బ్యాంకర్‌గానే కాకుండా మూడేళ్లుగా మౌంటెన్ బైకర్‌గా కూడా ఉన్నాను. పర్వతాల్లో చేసే సాహసోపేతమైన పోటీల్లో విజేతగా నిలుస్తుండేదాన్ని. ఆ పోటీలు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేవి. రెండేళ్ల క్రితం లదాఖ్‌లోని లేహ్‌లో జరిగిన యుసిఐ ఎలిమినేటర్ ప్రపంచ కప్‌లో ఎలైట్ మహిళల విభాగంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపించింది.

■ శక్తిని గుర్తించాలి..

నా కూతురికి ఇప్పుడు తొమ్మిదేళ్లు. ఆమె కూడా క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నాను. అందుకు ట్రెనింగ్ కూడా ఇప్పిస్తున్నాను. చదువుతోపాటు టాలెంట్‌ను కూడా గుర్తించి, దానిని మెరుగుపరుచుకునే ప్రయత్నం చేయాలని అమ్మాయిలకు చెబుతుంటాను. ఈ నెల పదిన జరిగే రేస్‌లో పాల్గొంటున్నాను. గెలుపు – ఓటమి, విజయం – అపజయం అని చింతించకుండా 100 శాతం శక్తినీ, సామర్థ్యాన్నీ వినియోగించి లక్ష్యాన్ని సాధించి, ఫలితాన్ని భగవంతునికే వదిలేయాలి. ఇంకో విషయం.. ఏదైనా కొత్తగా చేయడానికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసులోనైనా విజయం సాధించవచ్చు. మీకుండాల్సింది ధైర్యం మాత్రమే'' అంటుంది ఇందు.

పరీక్షా కాలంలో పలికే చేయి

పరీక్షల సీజన్ వస్తే రమా పద్మనాభన్ ఇంటి వ్యవహారాలను పెద్దగా పట్టించుకోదు. పెళ్లిళ్లు, ప్రయాణాలు అసలే ఉండవు. ఆమె తనకు వచ్చే కాల్స్‌ను అటెండ్ చేసే పనిలో ఉంటుంది.
'అక్కా.. ఈ ఎగ్జామ్ రాయాలి'
'ఆంటీ... ఈ డేట్‌న ఎంట్రన్స్ ఉంది'
ఇలా దివ్యాంగులు ఆమెకు కాల్స్ చేస్తుంటారు.
వారి కోసం ఆమె పరీక్ష హాల్‌కు వెళ్లి వారి ఆన్సర్స్‌ను రాసి పెడుతుంటుంది.
'ఇది గొప్ప తృప్తినిచ్చే సేవ' అంటోందామె.


ఓ దివ్యాంగుడికి పరీక్ష రాసిపెడుతున్న రమా పద్మనాభన్

చదువుకునే రోజుల్లో ఎవరైనా పరీక్షలు రాయవచ్చు. చదువు అయిపోయాక ఏవైనా కోర్సులు సరదాగా చదివితే పరీక్షలు రాయవచ్చు. కాని రమా పద్మనాభన్ అలా కాదు. ఆమె ప్రతి ఆరు నెలలకు విద్యార్థులకు సెమిస్టర్ ఎగ్జామ్స్ జరిగినప్పుడల్లా 50 పరీక్షలు రాస్తుంది. అంటే రాసి పెడుతుంది. గత పదకొండేళ్లుగా ఆమె అలా చేస్తూనే ఉంది. దివ్యాంగులకు పరీక్షలు రాసి పెట్టే స్క్రయిబ్‌గా ఆమెకు కోయంబత్తూరులో ఉండే పేరు అలాంటిది.

గృహిణిగా ఉంటూ...

కోయంబత్తూరుకు చెందిన రమా పద్మనాభన్ సైకాలజీలో డిగ్రీ చేసింది. ఆ తర్వాత 'గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్'లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కూడా చదివింది. భర్త ఫైనాన్షియల్ సెక్టార్‌లో పని చేస్తాడు. ఆమెకు ఇద్దరు అబ్బాయిలు. గృహిణిగా పిల్లలను చూసుకుంటూ కాలం గడుపుతున్న రమా పద్మనాభన్ జీవితం 2013లో మారింది. 'ఆ రోజు నేను యోగా క్లాసుకు బయలుదేరాను. నా స్నేహితురాలి నుంచి 'ఒక అంధ విద్యార్థికి పరీక్ష రాసి పెడతావా?' అనే విన్నపం వచ్చింది. అలా రాయగలనా అనుకున్నాను. పరీక్ష కేంద్రం దగ్గరే కనుక ట్రై చేద్దామనిపించింది. వెళ్లి రాసి పెట్టాను. పరీక్ష ముగిశాక ఆ అంధ విద్యార్థి ముఖంలో కనిపించిన కృతజ్ఞత నాకు ఎంతో మనశ్శాంతిని ఇచ్చింది. ఆ తర్వాత నాకు కాల్స్ రావడం మొదలైంది. కోయంబత్తూరులో లూయిస్ బ్రెయిలీ అకాడెమీ ఉంది. వాళ్లు కాల్ చేస్తూనే ఉంటారు. వీరు కాకుండా దివ్యాంగులు, ఆటిజమ్ విద్యార్థులు... వీరు పెన్ పట్టి పరీక్ష రాయడం కష్టం. వారికి పరీక్షలు రాసి పెడుతుంటాను' అని తెలిపింది రమా పద్మనాభన్.



అంతా ఉచితమే

దివ్యాంగులకు, అంధులకు పరీక్షలు రాసేందుకు రమ ఎటువంటి రుసుమూ తీసుకోదు. పరీక్షా కేంద్రానికి కూడా సొంత ఖర్చులతోనే వెళ్లి వస్తుంది. 'అయితే అందుకు నా భర్తను అభినందించాలి. నీ డబ్బులు ఖర్చు పెట్టి వేరొకరి పరీక్షలు ఎందుకు రాస్తున్నావు అని ఎప్పుడూ అడగలేదు' అంటుంది రమ. 'అంధ విద్యార్థులు తమకు పరీక్షలు రాసి పెట్టేవారు లేరని తెలిస్తే చాలా టెన్షన్ పడతారు. ఆబ్సెంట్ అయితే పరీక్ష పోతుంది. అందుకే వారికి స్క్రయిబ్‌లు కావాలి. వారు చెబుతుంటే జవాబులు సరిగ్గా రాయగలగాలి. నేను ఆటిజమ్ విద్యార్థులకు రాసి పెట్టేటప్పుడు మరింత శ్రద్ధగా ఉంటాను. వారు సమాధానాలు కంటిన్యూస్‌గా చెప్పడంలో ఇబ్బంది పడతారు. ప్రోత్సహిస్తూ రాబట్టాలి. అదే కాదు హైస్కూల్ పాఠాల దగ్గరి నుంచి ఇంజినీరింగ్ పాఠాల వరకూ అవగాహన ఉండాలి. అందుకే ఆ పాఠాలు కూడా తెలుసుకుంటూ ఉంటాను. స్క్రయిబ్‌గా నేను మారేటప్పటికి నా పిల్లలు చిన్నవాళ్లు. నా చిన్నకొడుకుకైతే ఐదారేళ్లవాడు. ఇంటిదగ్గర వాణ్ణి ఒక్కణ్ణే వదిలి తాళం వేసుకుని పరీక్ష రాసి పెట్టిన సందర్భాలున్నాయి' అని తెలిపిందామె.

కొనసాగే అనుబంధం

'నేను రాసిన పరీక్షలతో కోర్సులు పాసై ఉద్యోగాలు పొందిన దివ్యాంగులు చాలా మంది ఉన్నారు. వాళ్లంతా నా కాంటాక్ట్‌లో ఉంటారు. తమ జీవితంలో సాధిస్తున్న ప్రగతిని తెలియజేస్తుంటారు. అదంతా వింటుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. జీవితానికి ఒక అర్థం దొరికినట్టు ఉంటుంది. నా పెద్దకొడుకు సీనియర్ ఇంటర్‌కు వచ్చాడు. వాణ్ణి వీలున్నప్పుడల్లా స్క్రయిబ్‌గా పని చేయడానికి పంపుతున్నా. వాడు ఆ పని చేస్తున్నందుకు ఎంత సంతోషపడుతున్నాడో చెప్పలేను' అని ముగించింది రమా పద్మనాభన్.

విద్యాప్రమాణాలు మెరుగుపడడం, కొత్త రంగాలు ఉనికిలోకి రావడం వల్ల 'ఉద్యోగమే సర్వస్వం' 'ఉద్యోగం దొరికితే చాలు' అనుకోవడం లేదు యువతరంలో చాలామంది. దీనికి కారణం...ప్రత్యామ్నాయ అవకాశాలు. 'ఉద్యోగం ఎందుకు చేయాలి?' నుంచి 'చేస్తే ఎలాంటి ఉద్యోగం చేయాలి' వరకు కెరీర్ బాట పట్టడానికి ముందు రకరకాల కోణాలలో ఆలోచిస్తున్నారు. మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

నవతరం... ఉద్యోగ పర్వం



44 దేశాల్లో మిలీనియల్స్, జెన్ జెడ్‌పై సర్వే చేసింది డెలాయిట్. దీని ప్రకారం ప్రైమరీ జాబ్‌తోపాటు మరో జాబ్ చేస్తున్న యువ ఉద్యోగుల సంఖ్య తక్కువేమీ కాదు. బెంగళూరులో ఒక ప్రైవేట్ కాలేజీలో పని చేస్తున్న పరిమళ ఆన్‌లైన్‌లో వ్యాపారం కూడా చేస్తుంటుంది.

'డబ్బు కోసం కాదు. అదొక ప్యాషన్' అంటుంది తన ఆన్‌లైన్ వ్యాపారం గురించి.

లింక్డ్ ఇన్ సర్వే ప్రకారం 2023లో మన దేశంలో 88 శాతం మంది జెన్ జెడ్ ఉద్యోగులు 'ఉద్యోగ మార్పు'నకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జెన్ జెడ్ ఉద్యోగులపై ఆర్పీజీ గ్రూప్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పదిమందిలో ఆరుగురు మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

'పని ఒత్తిడి వచ్చినట్లు భరించాల్సిందే' అని రాజీపడడం కంటే 'జీతం తక్కువ అయినా సరే నాకు నచ్చిన ఉద్యోగం చేస్తాను' అని ఆలోచిస్తున్న వారి సంఖ్య యువతరంలో ఎక్కువగానే ఉంది.

ముంబైలోని ఒక మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం చేసిన అనన్యకు పనిభారంతో ఊపిరాడేది కాదు. ఒక ఫైన్ మార్నింగ్ 'ఇది కాదు జీవితం' అనిపించింది. తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తోంది. 'నేను పని చేస్తున్న కంపెనీతో పోల్చితే ఇది చాలా చిన్న ఉద్యోగం కావచ్చు. కాని ఎంతో సంతోషంగా ఉంది' అంటుంది అనన్య.

ఒక మార్కెటింగ్ సంస్థలో ఉద్యోగం చేసిన ఇరవై సంవత్సరాల సారా బోహ్రా ఆ ఉద్యోగం మానేసి సొంతంగా మార్కెటింగ్ ఫర్మ్ మొదలుపెట్టింది. వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది.

తీయటి పాఠాలు

రాజస్థాన్‌లోని వనస్థలి యూనివర్శిటీలో బీబీఏ డిగ్రీ పూర్తి చేసిన అనువ కక్కర్ ఉద్యోగం కంటే సొంత స్టార్టప్‌కే ప్రాధాన్యత ఇచ్చింది. అయితే కస్టమైజ్డ్ పోస్టర్ కార్డ్‌లకు సంబంధించి ఆన్‌లైన్ బిజినెస్‌లో ఫెయిల్ అయింది. అయితే ఈ ఫెయిల్యూర్ నుంచి పాఠాలు నేర్చుకున్న అనువ 'టిగెల్' చాకోలెట్ బ్రాండ్‌తో సక్సెస్ అయింది. హాట్ చాక్లెట్+వింటర్= హ్యాపీనెస్ నినాదంతో చిన్న బడ్జెట్‌లో కంపెనీ మొదలు పెట్టింది. కస్టమర్ చాయిస్‌లను అర్థం చేసుకోవడంలో పట్టు సాధించింది. 'టిగెల్' స్టార్ట్ చేసినప్పుడు అనువ వయసు 21 సంవత్సరాలు. 'చిన్న వయసులో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానం మొదలు పెట్టడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది' అంటుంది అనువ కక్కర్.



'ఇప్పుడు చాలా సౌకర్యంగా ఫీలవుతున్నాను. పని ప్రకారం కాదు గంటల ఆధారంగా ప్రొడక్టివిటీని కంపెనీలు అంచనా వేస్తున్నాయి' అంటుంది సారా.

బెస్ట్ ప్లాన్ బెడిసి కొడితే?

'ఈ రంగంలో మాత్రమే పనిచేస్తాను అని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఏ రంగంలో పని చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. యాంత్రిక జీవితం కంటే ఉల్లాసకరమైన మార్పు చాలామంచిది' అంటుంది చెన్నైకి చెందిన శ్రీతేజ.

కోల్‌కత్తాకు చెందిన 23 సంవత్సరాల మనీష తన ఉద్యోగానికి సంబంధించి ఇప్పటికీ మూడు రంగాలు మారింది. అలా అని ఆమెలో పశ్చాత్తాపం ఏమీ లేదు.

'ఏ రంగంలో అయినా పనిచేయగలను అనే నమ్మకం వచ్చింది' అంటుంది మనీష.

వర్క్ నుంచి గ్యాప్ తీసుకోవాలనుకునే యువతరం కోసం ఈమధ్య కాలంలో ఎన్నో 'గ్యాప్ ఇయర్ కమ్యూనిటీస్' వచ్చాయి. 'గ్యాప్ ఎక్స్' పేరుతో హరియాణాలోని అశోకా యూనివర్శిటీలో 40 మంది స్టూడెంట్స్‌తో కూడిన గ్రూప్ ఉంది.

'యువతలో చాలామంది కెరీర్ మార్గాన్ని నిర్ణయించుకునే ముందు వివిధ అవకాశాల గురించి అన్వేషిస్తున్నారు. ఆలోచిస్తున్నారు' అంటున్నాడు దిల్లీ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ దినేష్ సింగ్.

చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి నచ్చిన ఉద్యోగం చేయడం, సొంతంగా కంపెనీ మొదలుపెట్టడం, ఉద్యోగ విరామం తీసుకొని ఆన్‌లైన్ కోర్సులలో చేరడం వరకు తమదైన దారిలో ప్రయాణం చేస్తోంది నవతరం.

రంగుల ప్రపంచానికి ఆవల...

● సోషల్ యాక్టివిస్ట్ ● ఫ్యాషన్ డిజైనర్ ● రైటర్ ● మోటివేషనల్ స్పీకర్

కరీనా కపూర్ అనగానే రంగుల ప్రపంచం కళ్ల ముందు ఆవిష్కారం అవుతుంది. అయితే ఈ అందాల నటికి మరో ప్రపంచం కూడా తెలుసు. స్త్రీ సాధికారత నుంచి మెన్‌స్ట్రువల్ హైజీన్ వరకు ఎన్నో అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దేశ వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు వెళుతోంది. పేదింటి బిడ్డలతో మాట్లాడుతోంది. తాజాగా యూనిసెఫ్ ఇండియా నేషనల్ అంబాసిడర్‌గా నియామకం అయిన కరీనా కపూర్‌లో ఫ్యాషన్ డిజైనర్, రైటర్, మోటివేషనల్ స్పీకర్, సోషల్ యాక్టివిస్ట్ ఉన్నారు...



కరీనా కపూర్

ఉత్తమనటిగా సుపరిచితమైన కరీనా కపూర్ సృజనాత్మకమైన డిజైనర్ కూడా. క్లాతింగ్ రిటైలర్ 'గ్లోబస్'తో కలిసి పనిచేసింది. న్యూట్రిషనిస్ట్ రుజుత దివాకర్‌తో కలిసి తీసుకు వచ్చిన 'డోంట్ లూజ్ యువర్ మైండ్, లూజ్ యువర్ వెయిట్' పుస్తకం అమ్మకాల్లో రికార్డ్ సృష్టించింది. కరీనా కపూర్ వాయిస్‌తో ఈ పుస్తకం ఆడియో బుక్‌గా రావడం మరో విశేషం. 'ది స్టైల్ డైరీ ఆఫ్ బాలీవుడ్ దివా' పేరుతో తన జ్ఞాపకాల పుస్తకాన్ని తీసుకువచ్చింది. అదితి షా బీమ్జానీతో కలసి ప్రెగ్నెన్సీపై రాసిన పుస్తకం కమర్షియల్‌గా సక్సెస్ అయింది. రుజుత దివాకర్‌తో కలిసి న్యూట్రిషన్‌కు సంబంధించి 'ది ఇండియన్ ఫుడ్ విజ్‌డమ్ అండ్ ది ఆర్ట్ ఆఫ్ ఈటింగ్ రైట్' డాక్యుమెంటరీపై పనిచేసింది. ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై వచ్చిన 'గర్ల్ రైజింగ్' అనే డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్‌కు వాయిస్–వోవర్ ఇచ్చింది.

ఒకవైపు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ... పిల్లల విద్య, మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. మహిళలపై హింసను నిరోధించడానికి ఎన్‌డీ టీవి ప్రారంభించిన శక్తి క్యాంపెయిన్‌కు అంబాసిడర్‌గా పనిచేసింది. 2014 నుంచి బాలికల విద్యకు సంబంధించి యూనిసెఫ్‌తో కలిసి పనిచేయడం మొదలుపెట్టింది. రాజస్థాన్, మహారాష్ట్రలోని పాఠశాలలకు వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేది. జాల్నా జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంది.

నిరుపేద పిల్లల చదువు కోసం షర్మిలా ఠాగూర్‌తో కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. చైల్డ్–ఫ్రెండ్లీ స్కూల్ అండ్ సిస్టమ్స్ (సీఎఫ్ఎస్ఎస్) ప్యాకేజీని లాంచ్ చేసింది. చత్తీస్‌ఘడ్‌లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ వీక్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాగా చదివే పిల్లలు, పాఠాలు బాగా చెప్పే టీచర్‌లకు పురస్కారాలు అందజేసింది.

మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై యూనిసెఫ్ లక్నోలో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించింది. 'నవజాత శిశువులను కాపాడుకుందాం' పేరుతో కరీనా రాసిన వ్యాసానికి మంచి స్పందన వచ్చింది. నవజాత శిశువులు, తల్లుల క్వాలిటీ హెల్త్ కేర్‌కు సంబంధించి 'ఎవ్రీ చైల్డ్ అలైవ్' అనే క్యాంపెయిన్‌ను నిర్వహించింది. మదర్స్ డే సందర్భంగా యూనిసెఫ్ దిల్లీలో నిర్వహించిన సమావేశంలో కరీనా ప్రధాన వక్త.

ప్రకృతి వైపరీత్య బాధితుల కోసం, ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థల కోసం నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొంది కరీన. పిల్లల రోగనిరోధక శక్తి పెరుగుదలకు సంబంధించిన అంశాలపై పనిచేసే స్వస్థ్ ఇమ్యూనైజేషన్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసింది.

తాజా విషయానికి వస్తే...'నేషనల్ అంబాసిడర్‌గా యూనిసెఫ్‌తో నా అనుబంధం కొనసాగడం గౌరవంగా భావిస్తున్నాను. పిల్లల చదువు, హక్కుల కోసం నా గొంతు వినిపిస్తాను' అంటుంది కరీనా కపూర్.

'కరీనా కపూర్ ఎక్సలెంట్ కమ్యూనికేటర్' అని కితాబు ఇచ్చింది యూనిసెఫ్.

చిన్న విజయం చాలు... పెద్ద సంతోషానికి



సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో 'నేను ఎలా సాధించానంటే'లాంటి స్టోరీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రేస్ మొదలైంది. ఆ రేస్‌లో భాగంగా యువతరం ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ రేసులో మెంటల్ హెల్త్ అనేది వెనక్కి వెళ్లిపోయింది. రేస్ అనేది శాంతి, సంతోషాల కోసం ఉండాలి. విద్యార్థులు తమ మానసిక శాంతిపై ఎక్కువ దృష్టి పెట్టాలి. చిన్న విజయాన్ని కూడా పెద్ద విజయంగా భావించుకోవాలి. 'ఇదీ ఒక విజయమేనా!' అనుకున్నప్పుడు అసంతృప్తి ఉంటుంది. అసంతృప్తి నుంచి అశాంతి జనిస్తుంది.

– కరీనా కపూర్